


ఆమె అతని చేతుల్ని విడిపించుకుని ఇవతలికి జరిగి కూర్చుంది.

అతను ఆశ్చర్యంగా, సాలోచనగా ఆమె వైపు చూసేడు.

ఆమె తలవంచుకుని, ఇసుకలో పిచ్చి గీతలు గీయటం మొదలెట్టింది. ఎదురుగా, సముద్రపు అలలు ఒక్కొక్కటొక్కటిగా వచ్చి ఆమె పాదాల్ని ముంచి వెళ్తున్నాయి. దూరంగా నగరంలో సంచలనం—కొంపలు తగలబడి పోయేటప్పటి అరుపుల్లా విని పిస్తోంది.

క్షణాల తర్వాత అతనే అడిగేడు, "ఏం జ్యోతీ అలా అయిపోయావేం?"

ఆమె తలెత్తి అతని వైపు చూసింది. అతని ముఖంలో ఏ భావమూ గోచరించటం లేదు. అంతలో చూపులు మరల్చుకుంటూ అంది, "నా కెందుకో దిగులుగా వుందండీ మనసుకు తెలియని భయం పట్టుకు పీడిస్తోంది."

"ఎందుకూ?" ఆత్రుతగా అడిగేడు.

"పిరికిలా నాతో.." అర్ధోక్తిలో ఆపిం దామె.

అతను గొల్లున నవ్వేడు. "భలే దానివి జ్యోతీ. నాకు లేనిదిగులు నీ కెందుకు? నీతో ఇలా బీచి షికార్లు చేసినంతమాత్రాన నా అంతస్తు కొన్ని విలువల లోతున దిగబడిపోతుందనేనా — నీ అనుమానం, భయం? పిచ్చిపిల్లా, ఫక్తు ఆడదానివని పించావ్!" ప్రేమగా ఆమె భుజం తట్టి నడుం చుట్టూ చెయి వేసి దగ్గరికి తీసు కున్నాడు.

గాలి తాకిడికి అల్లల్లాడే ఆకులా ఐందామె. "లేదండీ. మీ రీ విషయం మరోసారి ఆలోచించటం మంచిదని హెచ్చరిస్తోంది నా మనసు."

"ఓహ్. మై ఇన్నోసెంట్ డార్లింగ్! ఎన్నిసార్లు చెప్పేది నీకు నేనీ విషయంలో దృఢమైన నిశ్చయానికి ఎప్పుడో వచ్చేను నిజం జ్యోతీ ఎందుకలా క్షణక్షణానికీ సందేహిస్తూ వుంటావ్? అసలు నిన్నివాళ బీచ్‌కి కదిలించటానికే నా తాతలు దిగొచ్చారు. వచ్చిన తర్వాత ఇదీ వరస!"

"వరసలో దిగొచ్చారన్నమాట అయితే!"

ఇద్దరూ పకపకా నవ్వుకున్నారు. అతని ముఖం ప్రఫుల్లమైంది. ఉద్వేగంగా చెప్పేడు. "అవును జ్యోతీ. నువ్విలా అడుగడుక్కీ సంశయాలు వెలిబుచ్చకూడదూ. ఎందుకంటే—నే నిన్ను పెళ్లిచేసుకోవటం సూర్యుడు పడమట అస్తమించినంత సత్యం కనుక. సరేనా?"

ఇద్దరూ మౌనంగా వుండిపోయేరు. బీచ్‌లో జనం పల్చబడసాగేరు. జ్యోతి హృదయంలో సందేహాలు మాత్రం దట్టం కాసాగినై. పెళ్ళిని గురించిన ఆలోచనలు రకరకాలుగా ఆమె మనసులో మొదలటం మొదలెట్టినై.

"సుండల్" అన్న కేకకి ఇద్దరూ ఈ లోకంలో కొచ్చేరు.

"ఇంతకీ, రేపటి ప్రోగ్రామ్‌కి వస్తేది, లేనిదీ తేల్చనే లేదు." అడిగేడతను.

జ్యోతి ఉలిక్కిపడి, పరధ్యానంగా "ఊ" అంది.

అతను మళ్ళా చెప్పేడు.

"ఏం ప్రోగ్రామో ఏమో! నాకలాంటివి ఆట్టేగా అలవాటు లేదు. సిగ్గుగా, భయంగా వుంది. పైగా అక్కడికి వచ్చే వాళ్ళంతా పెద్దపెద్ద వాళ్ళు. చూద్దాం లెండి."

"అదుగో అదే వద్దనేది నేను. ఏ విషయాన్నిగురించి అయినా చూద్దాం, చూద్దాం అని మాత్రం చెప్పకు. చేస్తాను, చెయ్యను లేదా ఇష్టం వుంది, లేదు' అని తేల్చి చెప్పాలి. ప్రోక్రాస్టినేషనంటే నాకు తగని చిరాకు, అసహ్యం. ఈ విషయంలో మా గురువు రావణబ్రహ్మగారు."

ఆమె చిన్నగా నవ్వింది. అయితే అతనన్న మాటలు మాత్రం ఆమెను స్మృతుల సుదూరాలకు విసిరివేసినై.

మరో కొంతసేపటికి ఇద్దరూ లేచి కారు వైపు కదిలేరు.

జ్యోతిని ఇంటి వద్ద డ్రాప్ చేసి, "రేపు ఉదయాన్నే వస్తాను. నీ రెడీ" అంటూ వెళ్ళిపోయేడతను.

* * *

"అరేయ్. వాసూ, రాజూ, లక్ష్మి, రమా రండర్రా రండి. అందరూ రండి. అమ్మా, నాన్నా రండి."

చిన్నా, పెద్దా అంతా— ఇంటిల్లిపాది బిలబిలమంటూ హాల్లో కొచ్చేరు.

"ఏవిట్రా అలా అరుస్తూ వస్తున్నావ్?" రంగయ్య కొడుకు నడిగేడు.

"గుడ్ న్యూస్ నాన్నా.. అన్నట్టు జ్యోతేది?" అని అటూ ఇటూ చూసి, "జ్యోతీ, ఓజ్యోతీ!" అంటూ కేకపెట్టాడు.

జ్యోతి కూడా హాల్లో కొచ్చింది.

"అంతా నిశ్శబ్దంగా వుండండి. ఏదీ పిల్లలంతా ఒక్కసారి చప్పట్లు కొట్టండి." తమాషాగా చేతులు తిప్పుతూ అన్నాడు రామం.

రంగయ్య, సుందరమ్మ—సన్నగా నవ్వుకుని, కుతూహలంగా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. పిల్లలంతా ఉత్సాహంగా చప్పట్లు కొట్టేరు.

"శుభవార్త వినటంటే— జ్యోతికి ఉద్యోగం కుదిరింది!"

పిల్లలు "అక్కకి ఉద్యోగం వచ్చింది. మా అక్కకి ఉద్యోగం వచ్చింది" అంటూ కేరింతలు కొట్టేరు. రంగయ్య, సుందరమ్మ ముఖాల నిండా సంతోషాన్ని పులుముకుని, సంతృప్తిగా ఊపిరి పీల్చుకుని— జ్యోతి వైపు చూసేరు. రామం కూడా చెల్లెలి వైపు చూసేడు.

జ్యోతి ముఖంలో ఏ భావమూ ద్యోతకం కాలేదు.

"అదేవిటు, అలా మాటలు రాని మొహం పెట్టావ్?" రామం నవ్వుతూ అడిగేడు.

"అబ్బే. ఏంలేదు" అంటూ కుర్చీలో కూర్చుంది జ్యోతి.

అక్కణ్ణుంచీ తల్లిదండ్రి—కొడుకుల మధ్య ఉద్యోగ వివరాల్ని గురించిన సంభాషణ సాగింది. జ్యోతి మాత్రం మవునంగా అన్నీ వినసాగింది.

తమ మాటలన్నీ పూర్తయిన తర్వాత జ్యోతి నుద్దేశించి చెప్పేడు, రామం. 'ఎల్లుండిలోపు డ్యూటీలో జాయిన్ కావాలి. ఎంతో గొప్ప రికమెండేషన్ వలన దొరికింది ఉద్యోగం. ఈ అవకాశం మళ్ళీమళ్ళీ వస్తుందా? కావలసినవేమైనా వుంటే ఈ రెండ్రోజుల్లోనూ ఏర్పాటు చేసుకుని ఎల్లుండి జాయిన్ అవు. ఏం జ్యోతీ?"

గట్టిగా నిట్టూర్చి, "ఊఁ. చూద్దాం. నన్నూ ఆలోచించుకోనీ" అని అక్కణ్ణుంచీ లేచి వెళ్ళింది జ్యోతి.

రామం, రంగయ్య, సుందరమ్మ ఆశ్చర్యంతో ఒకరి మొహాలొకళ్ళు చూసుకున్నారు.

గదిలో కొచ్చి పడుకున్నదన్నమాటే గాని, జ్యోతి మనసు మనసులో లేదు. ఆమె ఆలోచనంతా—రేపటి ప్రోగ్రామ్‌ను గురించీ, ఉద్యోగాన్ని గురించీ మాత్రమే సాగుతోంది.

వంటింట్లో సుందరమ్మ రామానికి భోజనం పెడుతూ చెప్పుకుపోతోంది... "దాని వరస నాకేం బాగా లేదురా రామం. ప్రతిదానికి ఏదో తనలో తను ఆలోచించుకుంటూ. కూర్చుంటుంది. మనసులో మాట పైకి చెప్పదు. వియ్యంపురాలు పోరాది వచ్చి ఎంతో బలవంతం చేస్తే తప్ప— అతనితో బీచ్‌కి పోలేదు. అతను మాత్రం ఏం తక్కువాడా? దీన్ని తప్ప మరొకర్ని పెళ్ళి చేసుకోనని తేల్చి చెప్పేడే. దీని వాలకం చూడబోతే నాకేదో అనుమానంగా వుంది. ఈ సంబంధం లాంటి సంబంధం ఈ జన్మలో మళ్ళీ మనకు దొరుకుతుందాగా సిరిరా మోకాలొడ్డినట్లుంది దీని పద్ధతి. ఇప్పుడు ఉద్యోగం సంగతే చూడు. వేలకి నూట డెబ్బై వచ్చే ఉద్యోగం దొరికితే ఇంకా ఏవిటో ఆలోచించుకోవా అంటుంది. వింతా వుగా."

"అదే నాకూ ఆశ్చర్యంగా వుందమ్మా. మన ఇంటి పరిస్థితులు తెలుసుకుని కూడా ఉద్యోగం చేయటానికి ఏమాత్రం ఉత్సాహం చూపటం లేదంటే చిత్రంగా వుంది."

అమ్మా, అన్నయ్యల సంభాషణను వింది జ్యోతి.

నిజమే. సారథి వంటి వరుడు లభించటం, తను చాహలకు, పరిస్థితులకు— ఈ జన్మలో లభ్యమైన అవకాశమే. అతను సారిన్ రిటర్న్‌డ్. నాలుగు తరాలకు సరిపోయే ఆస్తికి ఏకైక వారసుడు. అందుకే తనకు భీతి కలుగుతోంది. అతనెంత ఉదార హృదయుడు, సంస్కారం గలవాడూ అయినా—తనవంటి మధ్యతరగతి స్త్రీని భార్యగా పొంది సంతృప్తి పడగలడా? సంతృప్తి పడినా, దాంపత్య ఆనందాన్ని అనుభవించగలడా? విభిన్న మనస్తత్వాలతో, విభిన్న పరిధుల్లో పెరిగే తను మధ్య పొందిక అతక్కపోతే కలిగే పరిణామాలు తీవ్రంగా వుండవా? ఈ సందేహాలు, భీతి— తనని ఒక నిశ్చయానికి రానీక వ్యాపిస్తున్నాయి.

ఒక నిశ్చయానికి రాకుండా, అతనితో కలిసి షికార్లు, పరదాలంటూ—తిరగటం తన కయిష్టమన్న సంగతి యదార్థమే. అందుకనే సారథికి—రేపటి పిక్‌నిక్ ప్రోగ్రామ్ గురించి తన అభిప్రాయాన్ని ఇదమిత్థంగా తేల్చి చెప్పలేకపోయింది తాను.

పార్కులో పాల్గొనే వారంతా సంఘంలో గొప్పవలుకుబడి, అంతస్తు, అందం చందమ్మ

విద్య—కళాశాల. వాళ్ళ మధ్య తాను చంద్రుని ముందు దివిటీలా వెలవెల పోదా? పైగా అక్కడ పరిధి ప్రవర్తన ఎలా వుంటుందో—తనకు కాబోయే, అర్ధాంగిగా తనను పరిచయం చేస్తే"—

ఇలాంటి శంకలే ఉద్యోగాన్ని గురించి కలుగుతున్నాయి తనకు.

కొన్ని జతల మగకళ్ళ మధ్య, వారి దౌష్ట్య, అహంకారాలకు గురవుతూ, 'బాస్' అని పిలవబడే ఒకరి అడుగులకు మడుగు లొత్తుతూ, వ్యక్తిత్వాన్ని చంపుకుని—ఏమిటా ఉద్యోగం? అనిపిస్తోంది తనకు. నాగరికత, సంస్కారం ఎంతగా అభివృద్ధి చెందినవని అనుకున్నా—పదిమందితో తిరిగే స్త్రీని ఎందరు సమదృష్టితో చూసి ఆదరించగలరు? పెదవుల మీద నవ్వులు, మనసులో ఈర్ష్య, అసూయ, వక్రదృష్టి గదా—ఈ రోజుల్లో ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలకు సంభవిస్తున్న బహుమతి!

తన కుటుంబ పరిస్థితుల దృష్ట్యా

# సూదికందనీ దారం

తాను ఉద్యోగం చేయవలసిన అవసరం కనిపిస్తున్నా, తనని సందేహాలే—ముందడుగు వేయనివ్వటం లేదు.

ఉన్నట్టుండి జ్యోతి కొక ఆలోచన చప్పున స్ఫురించింది. ఈ శంకలన్నీ కేవలం తన భ్రమ వలనా, అనుభవాలేమి వలనా కలుగుతున్నవేమో? లేక, తరతరాలుగా స్త్రీజాతినిపట్టి పీడిస్తున్న కొన్ని దుర్బలత్వాలు తనలో జీర్ణించి పోయి ఇలాంటి అనుమానాలను కల్పిస్తున్నాయేమో?—

ఏమైనా ఈ విషయాల్లో తానొక నిశ్చయానికి రాలేక పోతోంది.

జ్యోతికి టీచర్ పరిధి అన్నమాటలు గుర్తుకొచ్చినై.

'ప్రొక్రాస్టినేషనంటే నాకు తగనిచిరాకు. అసహ్యం'—

కాని, తన జీవితంలో అడుగడుగునా ఆ దుర్బల్యమే చోటు చేసుకుని పీడిస్తోంది.

జ్యోతి మనస్సు ఆమె చిన్నతనం వైపు పరుగులు తీసింది.

అప్పటికి తనకు ఎనిమిదోయేడో, తొమ్మిదో ఏడో! ఊహ తెలిసీ తెలియని వయస్సు. ఒకరోజు మధ్యాహ్నం తమ యిల్లంతా కోలాహలంతో నిండిపోయింది. అమ్మా నాన్నా సంతోషంగా, ఏవేవో ఏర్పాట్లు చేస్తూ తిరగసాగేరు.

సాయంత్రం నాలుగయ్యేసరికి—నలుగురైదుగురు క్రొత్తవాళ్ళు తమ యింటి కొచ్చేరు. కొంతసేపటికి వాళ్ళల్లో—ఒక పెద్దబొట్టు ముత్తయిదువ, బుంగమూతిపాల ఆప్యాయంగా తనని తమ దగ్గరికి పిలిచేరు.

బెరుకుబెరుగ్గా వెళ్ళింది తను—అమ్మా నాన్నా, అన్నయ్యా ధైర్యం చెప్పి—వెళ్ళమని బలవంతం చేయటంవల్ల! ఆమె తనని చేతుల్లోకి తీసుకుని—కొంచెంసేపు ఒళ్ళంతా నిమిరి, పైనుంచీ క్రిందిదాకా పరీక్షించి, అడిగింది. "మాయింటికొస్తావా జ్యోతి? అక్కడ నీకు బోలెడు బొమ్మలున్నై ఆడుకోను బాబున్నాడు."

"నేరాను పో"మ్మని ఒక్కదూకులో ఇవతల కొచ్చేసిందితను. వెళ్ళి అమ్మ ఒళ్ళో వాలిపోయింది.

తర్వాత కొంతసేపు ఏవేవో మాట్లాడి వెళ్ళిపోయారు వాళ్ళు. వాళ్ళు వెళ్ళిన తర్వాత అమ్మా, నాన్నా తనను దగ్గర కూర్చోబెట్టుకుని ఏవేవో చెప్పారు. వాటన్నిటి సారాంశం—తనను వాళ్ళింటికి పంపడానికి పొమ్మనే. తను భయంతో, అయిష్టంగా ఏడ్చింది మొదటిరోజున. కాని రోజురోజుకూ తన పట్టు సడలసాగింది. దానికి కారణం అమ్మా, నాన్నల మాటలే. చివరి కొకరోజున తనకూ పంపుడు వెళ్తే బాగుంటుందనే ఊహ కలిగింది. అప్పట్లో తన కళ్ళముందు—ఆ యింటివాళ్ళ పెద్ద కారు, బంగళా, తోట, పట్టు పరికిణీలు పిల్లగొన్న—మాత్రమే మెదిలిన్నై. ఈ ఊహ రాగానే నాన్నకు చెప్పింది.

తనకిప్పటికీ బాగా గుర్తు—ఆ వేళ నాన్న వాళ్ళకి ఉత్తరం రాసి, పోస్టులో వేసి వస్తూ—తన కెక్కువ యిష్టమైన పంచదార జిలేబీ తెచ్చిపెట్టి, ఆ సంతోషంతో గట్టిగా ముద్దు పెట్టుకున్నాడు.


తిరుగు టపాలో వచ్చిన ఉత్తరం—తన పాలిట దురదృష్ట దేవతయింది. వాళ్ళు



అప్పటికి మరో పిల్లని దత్తత చేసేను
కున్నారట!
రాత్రి అన్నయ్యన్నాడు, "వెళ్ళొనట్లు
పాట ఆవేళే ఏడిస్తే బాగుండేదిగా"

అని. తను రోషంతో ఏడ్చేసింది!
"—ఏవమ్మా జ్యోతీ, ఇంకా నిద్ర
పోలేదూ!?"
తండ్రి ప్రశ్నకు ఆలోచనల్లో నుంచి

లేచుకుంది జ్యోతి. "ఇంకా లేదు నాన్నా
ఇప్పుడే పడుకోబోతున్నాను."
ఆమె కంఠస్వరంలో తొణికిన కలవర
పాటు, వేదనల్ని గమనించాడు రంగయ్య

# సూదికందని దారం

జాగ్రత్తగా ఆలోచించటం అవసరమే అయినా, ప్రతి విషయానికీ ఆలోచనలతో మనసు పాడు చేసుకోవటం మాత్రం మంచిది కాదమ్మా" అని వెళ్ళిపోయేడు.

కొంతసేపు అస్థిమితంగా ప్రక్క మీద దొర్లింది జ్యోతి. ఎప్పుడు నిద్ర పట్టిందో ఆమెకు తెలీదు!

*   *   *

తెల్లవారుతూనే వచ్చాడు సారధి.

గడపలోనే ఎదురుపడి చెప్పేడు రామం, "గుడ్‌మార్నింగ్ అండీ. గుడ్‌న్యూస్ సారధి గారూ. మా జ్యోతికి పైనో ఉద్యోగమొచ్చింది."

అనాలోచితంగా, యాంత్రికంగా 'గుడ్' అని ఇంట్లో కొచ్చేడు సారధి. రామం ముందుకు వెళ్ళిపోయేడు.

హాల్లో కూర్చున్న సారధిని పలకరించి, లోపలికి వెళ్ళి జ్యోతికి చెప్పింది సుందరమ్మ.

పైట చెంగుకు చేతులు తుడుచుకుంటూ హాల్లో కొచ్చిన జ్యోతిని చూసి, నిరుత్సాహ పడిపోయేడు సారధి. "వాటీస్ దిస్ జ్యోతీ? నువ్వింకా ... ... ...నిక్‌కి రావా?"

"ఉత్సాహంగా లేదండీ." అంది జ్యోతి.

'సిరపాన్ని కొనితెచ్చుకుంటే— టార్చిలైటేసి వెదికినా ఉత్సాహం కనిపించదు. అయినా, స్టెనోవైపోయావుటగా— ఇంక మేమేం గుర్తుంటాం!" అని ఆమె కళ్ళలోకి చూస్తూ "కంగ్రాట్స్" అన్నాడు.

జ్యోతి ఏమీ మాట్లాడలేదు.

క్షణాల తర్వాత సారధే అడిగేడు, "అయితే జాయినవుతున్నావా?"

"ఇంకా నిర్ణయించుకోలేదు."

"అబ్బబ్బ.. అన్నిప్రశ్నలకూ నీ నుంచి ఇదే సమాధానం. అయితే, నేనో సలహా యివ్వనా?"

"చెప్పండి"

"ఇంక కొన్నాళ్ళల్లో నాకు సి. ఏ. అండ్ సి. యస్‌వి కాబోతుంటివి గదా, ఇలాగా ఈ ఉద్యోగమెందుకు?"

"చెప్పు జ్యోతీ నీ అభిప్రాయమేమిటి?"

ఒక్కక్షణం ఆగి అంది జ్యోతి. "ఆలోచించాలి..."

"ఓకే!" అని చిటికె వేసి, చేతో విచిత్రంగా తల పట్టుకున్నాడు సారధి. "ఇంతకీ ఇప్పుడు రావన్నమాటేగా? అదన్నా కన్‌ఫమ్ చెయ్యి! 'ఒంటరినై పోయాను' అని పాడుకుంటూ వెళ్ళిపోతాను"

"ఎందుకలా రాలేననిపిస్తోందండీ"

"ఎందుకనా ఏమిటి?— ఇష్టంలేక" ఉన్నట్టుండి కోపంగా అన్నాడు సారధి.

"కాదు" జ్యోతి అప్రయత్నంగా అంది.

కాకపోవటమేం—అసలు కారణం అదే. పెళ్ళికి ముందే నాతో సరదాగా గడపటం నీకు సుతరామూ ఇష్టంలేదు. నామీద అంత నమ్మకం లేకపోతే భద్రంగా ఇంట్లో కూర్చో" అని విసవిస వెళ్ళిపోయాడు సారధి.

జ్యోతి ఏదో చెప్పబోయిందిగానీ, ఆ మాటలు ఆమె పెదవులు దాటి బయటికి రాలేదు.

సారధి వెళ్ళిపోయిన తర్వాత, అతని ఉత్సాహాన్ని హరించినందుకు, అతని మనసును కష్టపెట్టి కోపం కలిగించినందుకూ జ్యోతి బాధపడింది!

చివరికి అతని సరదా తీర్చటానికే నిశ్చయించుకుని, త్వరత్వరగా ముస్తాబై బయల్దేరి సారధి వాళ్ళింటికి వెళ్ళింది.

టాక్సీ దిగి వరండాలో అడుగెట్టిన జ్యోతికి నౌకరు ఎదురై చెప్పాడు, "అయ్యగారు, వారి స్నేహితులూ మూడు కార్లలో ఇప్పుడే వెళ్ళారమ్మా"

జ్యోతి హతాశురాలైంది!

ఆలోచనల భారంతో మనసును లగిలించుకున్న జ్యోతి జ్వరంతో మంచమెక్కింది. ఆరోజు రాత్రికే టెంపరేచర్ నూటనాలుగు డిగ్రీలుంది.

మర్నాడు ఆమె ఉద్యోగంలో చేరవలసిన రోజు. ఆ ఉదయం కూడా జ్వర తీవ్రత తగ్గలేదు. రామం ఆఫీసుకు వెళ్ళబోతూ జ్యోతి మంచం దగ్గరికి వచ్చేడు.

ఆమె అన్నవైపు నీళ్ళు నిండిన కళ్ళతో మూగగా చూసింది. రామం ఆమెనేమీ అడగకపోయినా, జ్యోతి అతని చూపుల్లోని ప్రశ్నని అర్థం చేసుకోగలిగింది. నీరసంగా హీనస్వరంతో అంది, "ఈ పరిస్థితుల్లో నేనేం చెప్పేదన్నయ్యా"

రామం హృదయం బరువెక్కింది. "ఛీ..ఛీ.. ఇప్పుడా సంగతెందుకు జ్యోతీ? నువ్వు విశ్రాంతి తీసుకో." అంటూ వెళ్ళిపోయేడు.

—ఆవేళ సాయంత్రం వచ్చేడు సారధి. జ్యోతి పరిస్థితి చూసి బాధపడ్డాడు. క్రితంరోజు తన కోపాన్ని, మాటల్ని మనసులో పెట్టుకోవద్దని ఆమెని కోరేడు. జ్యోతి—తానతని ఇంటికి వెళ్ళిన విషయం చెప్పాలనుకుంది కాని చెప్ప లేకపోయింది.

ఆ రాత్రి సారధి అక్కడే వుండిపోయేడు.

రెండు రోజుల్లో టెంపరేచర్ నార్మల్‌కి వచ్చింది. మరో రెండు రోజులకి కోలుకుంది జ్యోతి.

ఆవేళ రాత్రి-రామం భోజనం చేస్తున్న సమయంలో తన నిశ్చయాన్ని తెలిపింది జ్యోతి. "నేను పోస్ట్‌లో జాయినవుతా నన్నయ్యా. రేపు కనుక్కో."

సుందరమ్మ, రామం, రంగయ్య— జ్యోతి నిర్ణయానికి సంతోషించారు.

అయితే, మర్నాడు తెలిసిన వార్త— వాళ్ళనందర్నీ క్రుంగదీసింది. ఆ ఆఫీసు వాళ్ళు మరో అమ్మాయికి ఉద్యోగమిచ్చేశారు!

ఈ సంగతి తెలిసిన జ్యోతి— కాలేజీలో సీటు దొరకని రోజున అనుభవించిన బాధను మళ్ళీ అనుభవించింది.

ఆమెకా సంఘటన గుర్తుకొచ్చింది.

స్కూల్ ఫైనల్ ప్యాసైన జ్యోతి చదువును అక్కడితో ఆపేద్దామనుకున్నాడు రంగయ్య. అయితే సుందరమ్మ, రామం మాత్రం ఆమెను పై చదువులకి పంపాలని పట్టుబట్టేరు. చివరికి రంగయ్య కూడా వాళ్ళ మాటనే పాటించ తలచుకున్నాడు. అయితే, ఆర్థిక పరిస్థితుల్నీ, తండ్రి క్లిష్ట స్థితినీ—గ్రహించిన జ్యోతి తాను కాలేజీలో చేరనని తండ్రికి చెప్పింది.

రంగయ్య అన్నీ ఆలోచించుకుని, "వద్దు జ్యోతీ. నువ్వు కాలేజీలో చేరి చదువుకో! మనకిబ్బందులు, డబ్బు ఇబ్బందులూ ఎప్పుడూ వుండేవే. డబ్బులేదని ఇవాళ చదువు ఆపుకుని, డబ్బు వున్నపుడు మళ్ళీ కాలేజీలో చేరి చదువుకుందామంటే— ఆ చదువు

రుగానే వుంటుంది. విద్యాభ్యాసానికి విఘ్నా లేర్పడితే, ఆగకడు. శరీరం, బుద్ధి సరిగా గాడి తప్పితే, మళ్ళీ మన మాట వినవు" అని సగానికి నవ్వుకొన్నాడు.

జ్యోతి సరేనంది. ఉత్సాహంగా కాలేజీలో చేరలేకపోయినా ఆమెకు ఏమీ లక్ష్యం లేదు.

ఆ విధంగా ఆగిపోయిన కాలేజీ చదువును గురించి మళ్ళీ ఆమె ఏనాడు తలచలేదు.

జ్యోతి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఓ వారం రోజులు గడిచాయి. ఆ వారం రోజుల్లోను ప్రత్యేక సంఘటనలేవీ జరగలేదు.

మధ్యాహ్నం మూడుగంటలైంది—

జ్యోతి గదిలో కూర్చుని ఏదో నవల చదువుకుంటోంది. పిల్లలంతా బడికి వెళ్ళారు. సుందరమ్మ వంటింట్లో కొంగు పరచుకొని పడుకున్నది.

సారథి హడావిడిగా వచ్చాడు. వస్తూ వస్తూ ఓ వార్తని మోసుకొచ్చాడు. సరాసరి జ్యోతి దగ్గర కెళ్ళి ఉత్సాహంగా చెప్పాడు.

"గుడ్‌న్యూస్ జ్యోతీ. నాకు ఢిల్లీలో అప్పాయింట్‌మెంటిచ్చారు. ఏడవ తేదీన మన ప్రయాణం."

"సారిగ్గాడ్. కంగ్రాచులేషన్స్"

"ఉట్టుట్టి కంగ్రాచులేషన్స్ కాదు గాని, ఇక్కడున్నన్ని నాళ్ళు నాకు క్షణం తీరిక వుండదు. ఇవాళ జీతం తాగేస్తు. నేనిక్కడ వుండేది సరిగ్గా ఏడురోజులు. సెవన్త్ జి.టి.లో టికెట్ రిజర్వ్ చేసుకున్నా. కనుక" అని సిక్కు తిప్పుకున్నాడు సారథి.

"అను క.........."

"కనుక, తమరు మన వివాహం సంగతి వాళ్ళకే తెలియ చెప్పేయాలి."

జ్యోతి సిగ్గుతో తలవంచుకుంది.

"ఆ, అన్నట్టు మర్చిపోయాను. నేను మళ్ళీ నిన్ను కలుసుకోలేకపోవచ్చు. ఎందుకంటే ఈ వారంలోపలనే నేను చక్కబెట్టు కోవలసిన వ్యవహారాలు చాలా వున్నాయి. అందుకని నీ అభిప్రాయాన్ని నువ్వే వచ్చి నాకు చెప్పాలి. తెలిసిందా?"

జ్యోతి తలవూపి ఊరుకుంది. క్షణం తర్వాత ఆమె లేచి వంటింట్లో కాఫీ గ్లాసులో పోసి అతనికిస్తూ, "నేనే వచ్చినా, కాకుండా [illegible]" అంది.

కాఫీ సిప్‌చేస్తూ, "గడుసు దానివే" అన్నాడు సారథి. ఇద్దరూ నవ్వుకున్నారు.

సుందరమ్మ గారికి కూడా ఈ విషయం చెప్పి వెళ్ళిపోయాడు సారథి. వెళ్తూ వెళ్తూ జ్యోతి కొక హెచ్చరిక చేసి మరీ వెళ్ళాడు— "ఏడవ తేదీలోపు నువ్వు నీ నిర్ణయాన్ని తెలుపకపోతే, జరిగే పరిణామాలకి బాధ్యత నీదే అవుతుంది."

ఆ రోజు నుంచీ జ్యోతికి పుస్తకం చదవటం ఆగిపోయినట్లైంది. ఏ పని చేస్తున్నా పెళ్ళిని గురించిన ఆలోచనే! అయినా ఎటూ తేల్చుకోలేక సందిగ్ధావస్థలోనే రోజులు గడిపేసింది.

ఏడవ తేది రానేవచ్చింది. గంటలు గడుస్తూనే వున్నాయి. జ్యోతికి సత్యం అవగత మయ్యేసరికి సాయంత్రమైంది. తల్లీ తండ్రీ ఆమెను చివరిసారిగా హెచ్చరించారు. "కనీసం వీడ్కోలివ్వడానికైనా రాలేదని అతనెంత బాధపడుతున్నాడో! ఇదేమిటే అలా బెల్లం కొట్టిన రాయిలా కూర్చుండి పోయావ్. లే. లేచి స్టేషన్ కన్నా వెళ్ళరా.'

జ్యోతి ఒక్క వుదుటున లేచింది. ఆమె ముఖంలో ఆనందరేఖలు పొడసూపినై. ఉత్సాహంగా తల్లి దగ్గరకు వెళ్ళి ఆమె చెవిలో ఏదో చెప్పి క్షణంలో ముస్తాబైంది.

సుందరమ్మ కళ్ళు సంతోషంతో మిలమిల లాడేయి. కూతురు చెప్పిన మాట భర్తకి చెప్పింది. తృప్తిగా నిట్టూర్చే డాయన.

టాక్సీ ఎక్కుతూ టైమ్ చూసుకుంది జ్యోతి. జి. టి. బయల్దేరటానికి మరో పావుగంట వ్యవధి మాత్రమే వుంది

సెంట్రల్ కొచ్చి, ప్లాట్‌ఫారం టికెట్ తీసుకొని స్టేషన్లోకి పరిగెత్తింది జ్యోతి. ఆమె కాళ్ళు తడబడసాగినై. గుండె ఆత్రంతో వేగంగా కొట్టుకోసాగింది.

జ్యోతి నాలుగు అంగల్లో ప్లాట్‌ఫారం మీదికి వచ్చింది. జి. టి. అప్పటి కప్పుడే ప్లాట్‌ఫారం దాటి వెళ్ళిపోయింది!

ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండి పరిసరాలు మసకబారినై!

రెండురోజుల తర్వాత, సారథి నుంచి ఒకే ఒక్క వాక్యం గల జాబు నందుకుంది జ్యోతి.

'నేను నా నిశ్చయాన్ని విధిగా మార్చు కున్నాను!'

